
# ఉరిబిగి

సింగమనేని నారాయణ




**వర్షం** ... వర్షం ...

ఒకటే వర్షం ...

వెండితీగెల్లాంటి వర్షం.

నారప్ప రెప్ప కొట్టకుండా చూస్తున్నాడు.

బజారులో నీళ్ళు బిరబిరా పరుగెత్తుతున్నాయి.

వాటికేసి చూస్తూ నారప్ప ఆనందంతో తల మునక అవుతున్నాడు. చూస్తున్న కొద్దీ ప్రవాహ వేగం పెరుగుతూనే ఉంది. బజారుకు అవతల ఉన్న ఇళ్ళు కనిపించనంతగా వర్షం కురుస్తూనే ఉంది. నారప్ప గుండె సంతోషంగా కొట్టుకుంటూంది. ''ఇక ఫర్వాలేదు—ఈ సంవత్సరం బతికి బయట పడినట్టే! శనిక్కాయ పంట గ్యారంటీగా చేతి కొస్తుంది ...'' గొణుక్కుంటూ మురిసిపోతున్నాడు నారప్ప.

''ఏంది, నాయనా, గొణుక్కుంటా ఉండావు ... తెల్లారింది ... లెయ్యి'' అంటూ కిష్టిగాడు ఒక్క ఊపు ఊపేసరికి ఉలికిపడి గాభరాగా లేచాడు నారప్ప. లేచి చూస్తే ఏముంది? ఎదురుగా కొడుకూ, వాని వెనక రెండు పాత గాదెలూ ...

''వాన ... వాన ఏదీ ...''విచిత్రచూపులు చూస్తున్నాడు నారప్ప.

''ఏంది, నాయనా! అట్ల సూత్తుండావు ...'' తండ్రి ముఖంలోకే చూస్తూ అడిగాడు కిష్టిగాడు.

నారప్పకు ఏడ్వడమొక్కటే తక్కువైంది. ఎంత వాన! ఎంత వాన! అంతా ఉత్త కలేనా?

నీరసంగా పైకి లేచాడు నారప్ప.

అనుమానం ఎక్కడో పీడిస్తూంటే బయటకు వచ్చి బజారు వేపు చూశాడు. నీళ్ళ మొగం చూడక నూరేళ్ళయినట్టుంది ఆ బజారు వాలకం!

నిట్టూర్పుస్తూ నడవలోకి వచ్చాడు నారప్ప. కిష్టిగాడు వెనకాలే వచ్చి తండ్రికి ఒక బొగ్గు ముక్క అందించాడు. బొగ్గుముక్క నములుతూ పశువుల కొట్టంలోకి నడిచాడు నారప్ప.

పెద్దకొడుకు నరసింహులు కొట్టంలో పేడా, కసువూ వూడుస్తున్నాడు. గంజా, పేడా కలిసిన కమ్మని వాసన ముక్కుపుటాలకు తగిలింది.

నరసింహులు ఒక్కసారి తలెత్తి తండ్రి ముఖం లోకి చూసి మళ్ళీ పనితో మునిగిపోయాడు. కొడుకును చూస్తూంటే జాలీ, విచారం పుట్టుకొచ్చాయి నారప్పకు బుద్ధొచ్చినప్పట్నుండీ ఒకటే పని వాడికి. ఎప్పుడూ ఏదో పనిచేస్తున్నట్టే ఉంటాడు. గడియ తీరిగ్గా కూచుండే తీరికలేదు వాడికి. పని...పని...పని. ఎప్పుడు తెగుతుందో ఈ పని! ఆ వయసులో తను మాత్రం తక్కువ కష్టపడ్డాడా? ఇప్పుడంటే పూర్తి బరువు పనులు చెయ్యలేడు గాని, మొత్తం మీద ఏదో ఒక పని ఉండనే ఉంటుంది.

కొట్టంలోంచి బయటకు వచ్చాడు నారప్ప.

ఉదయపు గాలులు చల్లగా శరీరాన్ని తాకుతున్నాయి. సూర్యుడప్పుడప్పుడే ఉదయిస్తున్నాడు. తెల్లటి వెలుగు రేకలు భూమ్మీద పరుచుకుంటున్నాయి. వీధిలోని బావి గిలక శబ్దం కిర్రుకిర్రుమంటూ వినిపిస్తోంది.

కిష్టిగాడు పెద్ద చెంబు నిండా నీళ్ళు తెచ్చి తండ్రి చేతి కందించాడు. నారప్ప ఒక బండమీద కూచొని నోరూ, ముఖమూ కడుక్కొని, తువ్వాలుతో తుడుచుకుంటూ ఇంట్లోకి వచ్చాడు. వంటింట్లో దట్టంగా పొగలు సుళ్ళు తిరుగుతున్నాయి.

అరుగుమీద కూచొని నిద్రలేచే ముందు వచ్చిన అందమైన కలను జాగ్రత్తగా నెమరువేసుకోసాగాడు నారప్ప. వర్షపు ధారలు అతని కళ్ళముందు మెదలుతూంటే తన్మయత్వంతో పులకరించిపోయాడు. తెల్లవారుజామున వచ్చిన కలలు నిజమవుతాయంటారు. వాన నిజంగా వస్తుందేమో అన్న ఆశ అతన్ని బలంగా నమ్మిస్తోంది. ఎండిపోయి, నేలకు అతుక్కుపోయిన శనక్కాయపైరు అతని కళ్ళముందు దీనంగా మెదలుతోంది. విరుడంటే విత్తనం కూడా చేతికి చిక్కలేదు. ఈసారైనా పంట చేతికొస్తుందేమో అనుకుంటే, ఈ వాన ఇట్లా కలలా మిగిలిపోతోంది. 'ప్చ్!' పెదవులు చప్పరించాడు నారప్ప.

కిష్టిగాడు ఇంట్లో గోడవారగా కూచొని పలక మీద ఎక్కాలు రాసుకుంటున్నాడు. రెండుకోళ్ళు ఇల్లంతా గస్తీ తిరుగుతున్నాయి. వంటింట్లోంచి నారప్ప భార్య లక్ష్మమ్మ ఒక పొడుగాటి లోటా నిండా కాఫీ తెచ్చి నారప్ప చేతి కందించింది. పెద్దకూతురు నరసమ్మ వంటింట్లో పొయ్యిముందు కూచొని పుల్లలు ఎగదోస్తోంది.

నారప్ప ఎంతో ప్రీతిగా కాఫీ చప్పరిస్తుండగా లక్ష్మమ్మ ''ధర్మారమన్నా పొయిరాకూడదా?'' అంది అక్కడే నిలబడుకొని.

'యాలా?' అనబోయి నారప్ప ఆపుకున్నాడు. ధర్మవరం ఎందుకు వెళ్ళమన్నదీ అతనికి వెంటనే స్ఫురించింది. పెద్దబిడ్డను అత్తవారింటికి బట్టల్లపెట్టి పంపటానికి రెండు చీరెలు తేవాలి. వెంటనే అతనికి అనంతపురం వాసవీ ఎలెక్ట్రికల్స్ యజమాని రామమూర్తి గుర్తుకొచ్చాడు. బావికిసంవత్సరం క్రితం వేయించిన కరెంటింజను బాపతు బాకీ మెదిలింది. పాత ఇంజను పూర్తిగా పనికిరాకుండా చెడిపోతే కొత్తది వేయించారు. ఈ నెలలోగా ఎటు

తిరిగి బాకీ తీరుస్తానని నాలుగు రోజుల క్రితం వచ్చిన పెద్దమనిషికి గట్టిగా చెప్పి పంపిన విషయమూ గుర్తుకొచ్చింది. ఏం చేసేందుకూ దిక్కు తెలీక అతని ప్రాణం విలవిలలాడింది.

కాఫీ గడగడా నాలుగు గుటకల్లో తాగేసి గ్లాసు లక్ష్మమ్మ కందించి లేచి నిలబడ్డాడు నారప్ప.లక్ష్మమ్మ అతని ముఖంలోకే చూస్తూ గ్లాసు తీసుకుని వంటింట్లోకి వడిచింది.

నరసింహులు కొట్టంలోంచి పేడ చేతుల్తో బయటకు వచ్చి "ఒరే, కిష్టి, చేతులకు నీళ్ళు తీసకరారా" అని కేకేశాడు.

కిష్టిగాడు పర్రున వంటింట్లోకి వెళ్ళి చెంబు నిండా నీళ్ళు తెచ్చి, కొద్ది కొద్దిగా వంపుతూ అన్న చేతుల మీద నీళ్ళు పోశాడు. నారప్ప వాళ్ళవేపు చూస్తూ నడవలో అటూ ఇటూ కొద్దిసేపు తచ్చాడి, తలగోక్కుంటూ బయటకు వెళ్ళే ప్రయత్నంలో అడుగులు ముందుకు వేయబోతూంటే "నాయనా" అని పిలిచాడు నరసింహులు తడి చేతులు విదిలిస్తూ.

నారప్ప తలతిప్పి కొడుకు వేపు దీరంగా చూశాడు.

"బోరింగేసే వాళ్ళు పొద్దు వెంగటన్న బావికేసేకి వస్తారంట" అని ఆగాడు.

నారప్ప నిమిషంపాటు వూరకుండి, "వస్తే..." అన్నాడు.

నరసింహులు పంచె కొసలతో చేతులు తుడుచుకుంటూ, "మనమూ వేయిస్తే బావుంటుంది. .." అన్నాడు.


నారప్పకు కొడుకు అభిప్రాయం అర్థంకాకపోలేదు. బావిలో బొత్తిగా నీళ్ళు చాలటం లేదు. నాలుగు రోజుల కొక్కసారి పార బెట్టినా అర్ధ ఎకరాకు కూడా నీళ్ళు అందటం లేదు. ఆటికే నెలకిందట ఇన్నూరు రూపాయలు ఖర్చు పెట్టి పూడు తీయించినా నీళ్ళు జానెడు మించి వూరటం లేదు. వర్షాల్ని నమ్ముకుని మూడెకరాలు వరి నాటాడు. మామూలుగా అయితే నాలుగెకరాలు నాటేవాడు. నీళ్ళు చాలతాయో, చాలవో అనే అపనమ్మకంతో ఎకరా తగ్గించి పైరు పెట్టినా దానికే నీళ్ళు కటాకటిగా అవుతున్నాయి. ఇప్పు డుండే పద్ధతిలో అయితే రెండెకరాలు ఎండబెట్టుకోవాల్సిందే. బోరింగ్ వేయిస్తే నీళ్ళు పడతాయని నమ్మకమున్నా, దానికీ బోలెడు పెట్టుబడి కావాలి. ఎన్నిటికని లెక్కలు (డబ్బు) తెచ్చేది? ఈటికే యాడ చూసినా అప్పులే.

నారప్ప కళ్ళముందు బావి అట్టడుగున ఉన్న నీళ్ళూ, ఎండిపోవటానికి సిద్ధంగాఉన్న పైరూ మెదలుతూనేఉన్నాయి. ఆ పంటా చేతికిరాకపోతే కనీసం తిండి గింజలు కూడా కొంపలో లేకుండా... తిండిగింజలు కూడా కొనాలంటే ఎంత నామర్దా...ఛూ...ఛూ... ఛూ.. వద్దురా, నాయనా...ఈ పెద్దమ్మా...

ఒళ్ళంతా క్షణకాలం జలదరించి వట్టయింది నారప్పకు.

నరసింహులు తండ్రి ముఖం వేపే చూస్తూండిపోయాడు.

నారప్ప మెల్లగా నచ్చి అరుగు మీద కూచొని పనీను జేబులోంచి బీడీ బయటకు తీసి పెదవుల




మధ్య ఉంచుకుని, నిదానంగా అగ్గి పెట్టె తెరచి పుల్లను బయటకు లాగి గీచి వెలిగించుకున్నాడు. రెండు దమ్ములు లాగి పొగ బయటకు వదిలాడు. తను విడిచిన మేఘంలాంటి పొగను చూస్తూ, "రేటెంత మాట్లాడి నారంటరా?" అనడిగాడు.

నరసింహులు వాళ్ళమ్మ అందించిన కాఫీ గ్లాసు చేతికి తీసుకుని అరుగుకు ఈ మూల కూచుంటూ "అడుగు ముప్పయి రూపాయలంట. మొదటేసే ఇరవై అడుగులదంకా అదే లెక్కన ఏస్తారంట. అవతల అడుగుకు ఇరవై అయిదంట. . ." అన్నాడు.

"ఇంత రేటా? పైనిరుడు పుల్లన్న వేయించినప్పుడు అడుక్కు పదో, పండ్రెండో తీసుకున్నట్టు గుర్తు. ఈసారి బావుల్లో నీళ్ళు లేక గిరాకీ పెరిగే సరికి ఈ నాయాళ్ళు కూడా రేటు బాగా పెంచి నట్టుండారు. అందరికీ అదును చిక్కినోడు రైతే." నారప్ప వినబడీ వినబడనట్టు గొణిగాడు.

"అన్ని చోట్లా ఇదే రేటంట. రూపాయి కూడా తగ్గించుకోమన్నారంట . . ." అన్నాడు నరసింహులు..

నారప్ప మనసులో గుణించుకుంటూ లెక్కలు కట్టేడు. ఎంతలేదన్నా ఎనభై అడుగులు వేయించాల్సుంటుందేమో! రెండు వేలు దాటేట్టుంది. అంత లెక్క ఎవుర్నడగ్గల్డబ్బా...అన్నిటికీ ఆ శివయ్యనే నమ్ముకుంటే వడ్డీలతో ముంచేస్తాడు. అసలే కరెంటు బిల్లు ఎప్పుడొచ్చి పడుతుందా అని బితుకు బితుకుగా ఉంది. ఇంతకు ముందయితే నెల నెలా బిల్లులు వచ్చేవి. ఎట్లా అగపాట్లు పడి కట్టేవాడు. బిల్లు కలెక్టర్లు స్ట్రయికు చేసి పది నెలలుగా కరెంటు బిల్లులు రాలేదు. అంతా కూడగట్టుకుని యాపొద్దు నెత్తిన బడుతుందో! రెండేండ్లయింది బొత్తిగా సెనిక్కాయపంట కళ్ళ చూడక. చేతిలో దుడ్లే మెదలటం లేదు. ఏదో బావి కింద అంతో ఇంతో పండుతుంటే తినటానికి అటికాటికి సరిపోయేది. పై అక్కర్లన్నీ ఇక అప్పులే. ఈ సారి చూస్తే బావిలో నీళ్ళు పాతాళంలో ఉన్నాయి. వూర్లో రైతులందరూ తలకాయ లెత్తి ఆకాశానికి ఆశగా చూస్తున్నా ఒక్క బొట్టు పడలేదు. ఈసారి బావుల కిందా పంటలు లేకపోతే రైతుల గోడు చెప్పేకి లేదు. గవర్నమెంటోల్లు వూరికే అరిసేదేగాని బావుల్లో బోరింగు వేయించ కూడదా? కరువు సాయం, కరువు సాయమని వూరికే అనడమేగాని ఒక్క రైతుకు పావలా చేతి కొచ్చిందా? ఛూ. . .ఛూ. . ఛూ...అంతా దొంగ నా కొడుకులు.

నారప్ప గొణుక్కుంటూనే బీడీ చివరి దమ్ము పీల్చి గోడకు అదిమి ఆర్పి కిందకు పడేశాడు.

నరసింహులు కాఫీ తాగటం పూర్తిచేసి, గ్లాసు పక్కన పెట్టి లేచి నిలబడ్డాడు.

నారప్ప కొడుకు ముఖంలోకి చూసి ఏదో నిర్ణయానికి రాబోతున్నట్టుగా "చూద్దాంలేరా" అంటూ పైకి లేచి భుజం మీది తువ్వాలు తీసి విదిలించి బయటకు కదిలాడు.

● ● ● ●

నారప్ప తోటలో బావి చుట్టూ సందు లేకుండా జనం మూగి ఉన్నారు. బోరింగ్ మెషిన్ 'కుయ్'మని చెవులు చిల్లులు పడేట్లు, ఆమడదూరం వినబడేట్లు కూతలేస్తూంది. వూరిలో రైతులు చాలా మంది అక్కడ చేరి ఒకరి మాట మరొకరికి వినబడకుండా మాట్లాడుకుంటున్నారు. బోరింగ్ మెషిన్ మట్టిని ఈడ్చి ఈడ్చి బయటకు విరజిమ్ముతూంది. మొన్న వెంగటన్న బావిలో నలభై అడుగులలోపు దిగేసరికే నీళ్ళు పడ్డాయి. అంత తక్కువలో నీళ్ళు పడే సరికి రైతుల గుండెలో ఆశలు చిమ్ముకుని ఎగశాయి. బోరింగ్ వాళ్ళకు గిరాకీలు పెరిగాయి.

"బో గట్టి నేలప్పా! ఒక్కొక్క అడుగు తెగే సరికి బ్రమ్మ ప్రళయమవుతా ఉంది" అంటూ అనుభవమున్నట్టు ఒక రైతు మరో రైతుతో అంటున్నాడు.

"డుర్ డుర్ డుర్. కుయ్ కుయ్ కుయ్" అంటూ మెషిన్ హోరెత్తినట్లు అరుస్తూంది.

నారప్ప బావిగట్టు మీద కూచుని లోపలికి తొంగి తొంగి చూస్తున్నాడు. ఒక్కొక్క అడుగూ అతని సంపదను తొలుస్తున్నట్లుగా ఉంది. ఎంత తొందరగా నీళ్ళు పడతాయా? ఎంత ఖర్చు తగ్గుతుందా ? అనే చింత చేస్తున్నాడు నారప్ప. దేవుని దయ కొద్దీ నీళ్ళు బాగా పడితే నాలుగెకరాల పంటా చేతికి వస్తుంది. ముందు ముందుకు కూడా బావిలో నీళ్ళకు కటకట ఉండదు, మంచి ధార పడల్లగాని. నారప్ప వూహాల చెలిమిలో నీళ్ళు వూరుతూనే ఉన్నాయి.

నరసింహులూ, కిష్టిగాడూ, వాళ్ళమ్మా, అక్కా కూడా అక్కడక్కడా నిలబడి, అద్భుతం జరగనున్నట్లు చూస్తున్నారు.

బోరింగ్ సిబ్బంది కాఫీలూ, సిగరెట్లూ ఏకధాటిగా లగాయించేస్తున్నారు.

నారప్ప బోసిగా ఉన్న తన భార్య మెడవేపు చూశాడు. మూడుపారవల చైను ఇప్పుడు బ్యాంకులో ఉంది. రెండు రోజుల్లో తిప్పుకుని రెండు వేలిచ్చినారు బ్యాంక్ వాళ్ళు. తాను ధైర్యం చేసి తాకట్టు పెట్టాల్సి వచ్చింది. తానొక్కడేనా? యా రైతు ఇంట్లోకాంగ ఇప్పుడు బంగారు ఉంది? రకరకాల అవసరాలకు ప్రతి రైతూ బంగారును బ్యాంక్‌లో

పెట్టిన వాళ్ళే. ఒకరికే వచ్చిన తిప్పలైతే గదా?

''నేల శానా గట్టిగా ఉందప్పా! ఉత్త రాళ్ళు వస్తున్నాయి. అడుగు దిగేసరికి గంట పడతా ఉంది.'' పక్కనే ఉన్న మరో రైతు నారప్పకు వినబడేలా అన్నాడు.

నారప్ప గుండె గుబగుబ లాడింది. పద్దన్నుండీ పని జరుగుతూనే ఉంది. మధ్యాన్నం కావస్తూన్నా పది అడుగులు తెగలే.

గుర్ గుర్... డుర్ డుర్... కుయ్ కుయ్ మని బోరింగ్ మెషిన్ మొత్తుకుంటూంది.

''కోనాపురంలో సిద్దప్ప బావిలో నాలుగుచోట్ల దించినారంట! అయినా నీళ్ళు పడలేదంట. మొత్తానికి ప్రాప్తముండల్ల...'' ఆ రైతు నారప్ప చెవుల్లో వూదుతూనే ఉన్నాడు.

నారప్పకు మండుకొచ్చింది. అక్కణ్ణించి సర్రున లేచి మరో చోటికి వెళ్ళి నిలబడ్డాడు.

అడ్వాన్సు ఆరు నూర్లు చేతిలో పెట్టందీ బావి లోకి మెషిన్ దింపలేదు బోరింగోళ్ళు. నీళ్ళు పడినా, పడకపోయినా ఎన్ని అడుగులు దించితే దాని కయ్యేంత లెక్కా ఇయ్యాల్సిందే అని కండీషను. పని జరిగినన్నాళ్ళూ బోరింగ్ సిబ్బందికి భోజనాలూ, టిఫిన్లూ, కాఫీలు—ఈ ఖర్చు కూడా. మెత్తని చట్టయితే రోజుకు అరవై అడుగులు వేస్తామన్నారు. అంతలోగానే నీళ్ళు చిమ్ముకు రావా అనే భరోసాతో ఉన్నాడు నారప్ప. నేల అనుకున్నంత మెత్తది కాక పోవటంతో సాయంత్ర మయేసరికి వలబై అడుగులు దింపేశారు. అయిదు గంటలవుతూండగా పని ఆపేశారు. వచ్చే జనం, పొయ్యే జనంతో సాయంత్రం దాకా తోటంతా తిరణాలలా ఉంది. పని ఆపేసరికి జనం పల్చ బడ్డారు. బోరింగ్ సిబ్బంది బావి గట్టున బండ మీద కూల బడ్డారు. వాళ్ళూ బాగా అలిసిపోయారు, పాపం.

''ప్రాణం తీస్తూందయ్యా నీ బావి! ఉత్త రాళ్ళు. మాకేం గిట్టేట్టు లేదు. వేరే బావిలో అయితే ఇంకో ముప్పయి అడుగులు దించిండే వాళ్ళం'' అన్నాడు వాళ్ళ జట్టు నాయకుడు.

''ఇంక ఎన్ని అడుగులు దించితే నీళ్ళు పడతా యప్పా!'' ఆశగా, వినయంగా అడిగాడు నారప్ప.

''అది మే మెట్లా చెప్పుతామప్పా! వారం కిందట బండమీద పల్లెలో క్రిష్ణారెడ్డి బావిలో దించితే ముప్పయి అడుగులకే మోచేతి బుగ్గ చిమ్మింది. అంతా రైతు అదురుష్టమప్పా.''

అదృష్టం అనేసరికి నారప్ప గుండె చల్ల బడింది. బతుకంతా అదృష్టంతో పందెం కాసి నట్టుంది.

''రాత్రికి కోడన్నా కోసిపెట్టు, నారప్పా! కాఫీలు తాగి తాగి నోరంతా చెడిపొయ్యింది...'' అనడిగాడు వారిలో ఒకాయన.

''తిండిదేముంది లేప్పా! ఒకటి కాకపోతే రెండు కోసి పెడతాను'' అన్నాడు నారప్ప పైకి లేస్తూ.

మరు రోజు పొద్దున్నే ఆరూ ఆరున్నరకల్లా పని మొదలు పెట్టారు. వారికి వూరిలో మరో నాలుగు బావుల బేరాలు కుదిరాయి.

నిన్నటంత జనం లేరు బావిదగ్గర.. చుట్టు పక్కల తోటల వాళ్ళు సరదా చూస్తున్నట్టు అటూ ఇటూ తిరుగుతున్నారు. నారప్ప బావిగట్టు విడవకుండా కూచునున్నాడు. నరసింహులు బోరింగ్ సిబ్బందికి సహాయంగా చెప్పిన పనులు చేస్తున్నాడు.

లోపల నేల కొంత మెత్తగా ఉన్నట్టుందేమో, పది గంటలయ్యేసరికి ఇరవై అడుగులు తెగింది.

నారప్ప ప్రాణం ఒకవైపు విలవిలలాడిపోతూంది. అరవై అడుగులు తెగినా నీటి పట్టు చిక్కలేదు.

మధ్యాన్నం దాటేసరికి మరో పది అడుగులు తెగింది.

''ఏం నారప్పా! మరో పది అడుగులు దించ మంటావా?'' అనడిగాడు బోరింగ్ మనిషి.

''దించప్పా దించు. అయిందేదో అయింది.'' కీచుగొంతుతో అరిచాడు నారప్ప.

మరో పది అడుగులు దించేసరికి రెండు గంటలు దాటింది. ఉన్నట్టుండి కీచుమని గట్టిగా అరుస్తూ మెషిన్ ఆగిపోయింది.

''ఏమయిం దేమయింది'' అంటూ చుట్టూ ఉన్న వాళ్ళంతా అరిచినంత పని చేశారు.

''బండ పడిందప్పా! ఇంక కష్టమే'' అన్నాడు నిస్సహాయంగా బోరింగ్ మనిషి.


ఆరునెలలుగా ప్రభుత్వనిషేధంవల్లమరుగున
పడి రాష్ట్రహైకోర్టు తీర్పువల్లమళ్ళీవెలుగులోకొచ్చిన
మరీచిక
పునర్ముద్రణ త్వరలో వెలువడుతోంది!
ఇందులో...
* నవల నిషేధ ఉత్తర్వు-హైకోర్టు తీర్పు
* వివిధ పత్రికలలోవచ్చిన సంచలనవ్యాసాలు
* మిర్యాలగూడ విద్యార్థి ఆత్మహత్య అసలు కథ
* రచయిత్రి ముందు మాట
ప్రత్యేక ఆకర్షణలు!

మరీచిక నవలా రచయిత్రి
వాసిరెడ్డి సీతాదేవి
లేఖిని నుంచి వెలువడిన డైరెక్టు నవల
మరో మనసు కథ
వెల రూ: 12/-లే
ఆగస్టు'82లో వెలువడింది!
ఆంధ్రపత్రిక సీరియల్
మనసు కథ
త్వరలో మరీచికతో పాటు
విడుదలౌతుంది!

ఈ క్రింది చిరునామాకి రాసి
నేడే మీకు కావలసిన కాపీలు రిజర్వు చేసుకోండి!

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్*
3237 రాష్ట్రపతి రోడ్
సికింద్రాబాద్-500003

నెత్తిమీద బండ పడినట్టు తల దిమ్మెక్కింది నారప్పకు. సరసరా బావిలోకి దిగాడు. తలా ఒక మాట అనుకుంటున్నారు. 'చానా గట్టి బండ అడ్డమొచ్చి నట్టుంది' అని ఒకరూ, 'ఇంక ఇక్కడ చాలియాల్సిందే' అని ఇంకొకరూ, 'ఇంకేం నీళ్ళు పడతాయబ్బా' అని మరొకరూ ఒకటే కోలాహలం.

నారప్ప బోరింగ్ వైపు బిత్తర చూపులు చూస్తున్నాడు.

ఇక ఇక్కడ ఆపేయాల్సిందే అని నిర్ణయానికి వచ్చారు.

"బండ ఎంత ఘాతముందో చెప్పలేమప్పా. నువ్వు సరే అంటే ఇంకో మూల దించుతాం" అన్నారు.

"నా నెత్తిమీద దించండి" అంటూ గట్టిగా అరిచాడు నారప్ప.

ఒకరిద్దరు నచ్చ జెప్పాలని చూశారు—ఇంతా ఖర్చయింది, ఇంకో ప్రయత్నం చేస్తే మంచిదని. నారప్ప ఏం మాట్లాడకుండా నిలువు గుడ్లేశాడు. నరసింహులూ, వాళ్ళమ్మా దిక్కులు చూస్తున్నారు దిగులుగా.

"నా ప్రాప్తమింతే అనుకుంటాను. నన్ను నిలువునా కోసినా ఇంక పైసా కూడా చేతగాదు. మెషిన్ ఎత్తుకోండప్పా" అని చెప్పేసి నెత్తిమీద తువ్వాలు వేసుకున్నాడు నారప్ప.

సాయంత్రం అయిదయ్యేసరికి నారప్ప తప్ప ఒక్కరు మిగల్లేదు ఆ బావి దగ్గర. రావాల్సిన మొత్తమంతా లెక్కగట్టి ఖచ్చితంగా తీసుకుని తమ సరంజామా అంతా మరో బావికి తరలించారు బోరింగ్ వాళ్ళు. నారప్ప ఒక్కడూ బావి గట్టునున్న బండమీద కూచుని బావివేపూ, ఎండిపోతున్న పైరు వేపూ మార్చి మార్చి దిగాలుగా చూస్తున్నాడు. అతని కన్నుల్లో నీళ్ళు చిమ్మట మొక్కటే తక్కువయింది. బ్యాంక్‌లో తెచ్చిన రెండు వేలూ గాక మరో రెండు వందలు ఖర్చు వచ్చింది. ఇంత ఖర్చూ ఏట్లో పిసికిన చింత పండయిందే అని అతని మనసు మూలుగుతూంది. బ్యాంక్‌లో పెట్టిన గొలుసు మళ్ళీ పెళ్ళాం మెడలో ఎప్పుడు చూడగలగాలో అతనికి దిక్కే తోచలేదు.

బండ మీద నుంచీ లేచి మెల్లగా అడుగులు వేస్తూ గెనాల మీదుగా పైరు చుట్టూ ప్రదక్షిణం చేశాడు. ఇంక రెండు తళ్ళు పారితే వెన్ను పోయే పంట... తన వేపే ఆకలిగా చూస్తున్నట్టు అనిపించి పేగులు కదిలాయి నారప్పకు.

పొద్దు బాగా వాలి పోయింది. చింతమానుల నీడలు నారప్ప నిరాశలా నేలంతా పరుచుకున్నాయి. ఎండిన పెదాలను తడి చేసుకుంటూ తోట నుండి బయటపడి ఇంటి దారి పట్టాడు. దారిలో ఒకరిద్దరు ఎదురై ఏదో అడిగారు గాని, నారప్ప ముక్కులో వూపిరి కూడా విడవకుండా వారిని దాటేశాడు.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. కాటిలో పీనుగును పారవేసి వచ్చినంత విషాదంగామూ ఉంది. నారప్ప నడవ దాటుకుని వసారాలోకి వచ్చాడు. లోపల్నుంచి కిష్టిగాడు పరుగున ఎదురువచ్చి "నాయనోయ్... కరెంటు బిల్లిచ్చి పొయ్యినారు" అన్నాడు చేతిలో వెడల్పాటి కాగితం కదిలిస్తూ. షాక్ కొట్టినట్టుగా ఆగిపోయాడు నారప్ప.

కిష్టిగాడు తండ్రికి కాగితం అందించబోయాడు. నారప్ప దాని వేపే చూస్తూ "ఎంతొచ్చిందిరా" అన్నాడు జీరపోయిన గొంతుకతో.

కిష్టిగాడు కాగితం కళ్ళముందు పెట్టుకుని "ఎనిమిది నూటా యాభై రూపాయిలా నలభై పైసలు రాసినారు, నాయనా" అంటూ తండ్రి ముఖంలోకి చూశాడు.

నారప్ప వెర్రి చూపులతో కిష్టిగాడి నోటివేపే చూస్తూండి పోయాడు.

"ఏంది, నాయనా, అట్ల సూత్తుండావు?" బిక్కు బిక్కుగా అడిగాడు కిష్టిగాడు.

నారప్ప ఏం మాట్లాడలేదు. ★

# వారఫలాలు

**15-9-82 నుండి**
**21-9-82 వరకు**

## మేషం

ఈ వార కాలంలో లవాదిగా పరిష్కారం కాకుండా మిగిలిపోయిన వ్యవహారాలు పరిష్కారం కానున్నవి. మీకు రావలసిన బాకీలు, ఇతరత్రా నిల్వ ఉన్న ధనం లభిస్తుంది. మీరు ఇవ్వవలసిన బాకీలు కూడా తీర్చి ఋణ విముక్తి కొంతవరకైనా పొందగలుగుతారు. చిట్ ఫండు వగైరాల వారి వద్దనుండి ఋణం లభిస్తుంది.

## వృషభం

మీరు లోగడ పెట్టుబడిన ద్రవ్యం వ్యాపారం క్రమ క్రమాభివృద్ధినొందుట వలన గాని, వర్తమాన ధరల పెరుగుదల వలన కాని తిరిగి మీరు కొంత పెట్టుబడి పెట్టవలసిన అవసరం ఏర్పడుతుంది. ఇందులకు గాను మీ కున్న వానిలో కొన్ని అమ్మవలసిన అగత్యం కూడా తప్పదు. గృహ విషయంలో కూడా అధికవ్యయం సూచకం.

## మిథునం

ఈ వారం లగాయతు ఇంకా కొంత కాలం వరకు మీ ఆరోగ్యం తృప్తికరంగా ఉండదు. అప్పుడపుడు తొందరలు కూడా కలుగవచ్చు. ముందుగా తగు వైద్య పరీక్షలు చేయించి జాగ్రత పడుట అవసరం. త్వరలోనే శని మీ చతుర్ధరాశిని విడిచిపోనున్నందున జాగ్రత పడండి.

## కర్కాటకం

ఈ వారంలో ఇతరుల బుద్ధి కుశలతపై ఆధారపడి వారి మంచితనాన్ని వాడుకొని మీరు వృద్ధి పొందగల అవకాశా లున్నవి. ఆర్థిక రంగంలో కొంత వరకైనా జాగ్రత వహించి వ్యవహరించండి. ధనాభావం మిమ్ములను అనతి కాలంలోనే పీడింపనున్నది. గురు, శనుల చతుర్థచార కాలం అశుభం.

## సింహం

ఈ వారంనుండి మీకు శుభ కాలంగా ఉంటుంది. ప్రత్యేకించి దూర ప్రయాణాలు గావించవలసినవారు గాని, విద్యాభివృద్ధికై పరస్థాన వాసము గావించగల వారలకు గాని గ్రహబలం అనుకూల ప్రదం. సాంస్కృతిక కార్యకలాపాలు మీకు కీర్తి ప్రతిష్ఠల తెచ్చి పెట్టనుండుట విశేషం.

## కన్య

ఇతరులపై ఆధారపడి జీవించడం అలవాటైన వారు మీలో అధిక సంఖ్యాకు లున్నారు. అంటే అది దాస్య మనే భావం కలుగక అందులో లభించే లాభాలకు, ప్రాపంచిక విషయ సుఖాలకు ప్రాధాన్యత నిచ్చి వ్యవహరిస్తారు. ఇది ప్రమాదకరం. దాస్య విముక్తికి ప్రయత్నించండి.

## తుల

దైవ సంబంధ కార్యాచరణాదులపై ప్రీతి జనిస్తుంది. క్షేత్రాలను దర్శించి పరమాత్మ సేవ చేయాలనే భావం కలుగుతుంది. ఈ మీ భావాలు మీకు ఇబ్బందులు తెచ్చిపెట్టనున్నవి. మీ కుటుంబ సభ్యుల సహకారంతో మీకు జనించే వైరాగ్యం ఫలప్రదం గాని, అన్యథాకాదు.

## వృశ్చికం

భావి కాలంలో జరుగవలసిన కార్యాలకు ప్రోగ్రాము తయారు చేసి తృప్తి పొంద ప్రయత్నింప నున్నారు. మీరు సంకల్పించే వానికి దైవసాయం సహకరించాలనేది స్మరింపరు. అహంభావ బుద్ధి ప్రధానంగా వ్యవహరిస్తారు. ఇది క్షేమ మార్గంకాదు. పెద్దల సలహా పొందండి.

## ధనుస్సు

సాంఘిక కార్యక్రమాలలో విజయం సాధించుటకు, వృత్తి అభివృద్ధికి ఈ వారంలో గ్రహబలం మీకు సహకరించనున్నది. మీ ప్రయత్నాలలో క్లిష్ట సమస్యలు ప్రాప్తించినా, మనోధైర్యంతో వాని నెదుర్కొని జయం పొందగలరని విశ్వసించండి. శారీరక మానసిక శ్రమ అధికం.

## మకరం

ఈ వారంనుండి మీ ఆర్థిక స్థితి తృప్తికరంగా ఉంటుంది. మీ బాధ్యతల క్రమ మార్గంలో గౌరవప్రదంగా నిర్వహింపగలరు. అభివృద్ధి పొందుటకు మీరు గావించిన కృషి వృధాకాదు. కాని, మీరు విశ్వసించినట్లు కనపడే వ్యక్తులు మీకు అపకారం తలపెట్టనున్నారు.

## కుంభం

మీకన్న అన్నివిధాల అన్ని రంగాలలో ఉన్నతస్థాయి కలిగియున్న వారలతో సన్నిహితసంబంధాలు ఏర్పడనున్నవి. మిత్రులు సహకరిస్తారు. మీలో వయోవృద్ధులు అధిక గౌరవ మర్యాదల పొందనున్నారు. సహజ సుఖశాంతులకు ఏలాటి లోప ముండదు. బంధు ప్రీతి కూడా లభిస్తుంది.

## మీనం

అవివాహితులకు వివాహ ప్రయత్నాలు ఫలోన్ముఖంగా పరిణమింప నున్నవి. స్త్రీలలో ఉత్తరాభాద్ర నక్షత్ర జాతకులు ఇంకా రెండు వారాల కాలం నుండి అనుకూల ఫలాలను పొంద గలుగుతారు. ఉత్తమ సంతాన ప్రాప్తి వలన సుఖం అనుభవించే కాలంగా ఉంటుంది.

- దివాకరుని
వెంకటసుబ్బారావు